సాక్షి
అన్నమయ్య జిల్లా
మంగళవారం । 27 । జూన్ । 2023



తెలుగు తమ్ముళ్ల ఓవర్‌యాక్షన్

మదనపల్లె-చిత్తూరు ప్రధాన రహదారిపై తెలుగు తమ్ముళ్లు ఓవర్‌యాక్షన్ మొదలుపెట్టారు. ధర్నా చేసేందుకు పోలీసుల అనుమతి తీసుకోకుండానే రోడ్డుపై బైఠాయించారు. - 8లో



గంజాయి విక్రయదారులపై పీడీ యాక్ట్

యువతను మత్తులో ముంచి జీవితాలను నాశనం చేస్తున్న నలుగురు గంజాయి విక్రయ దారులపై పోలీసులు పీడీ యాక్ట్ కేసులు నమోదు చేశారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)



	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.540	రూ.760
రెండోరకం	రూ.330	రూ.520

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 997 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	--	135
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 11.44 కిలోలు

న్యూస్‌రీల్

ఫిర్యాదులపై స్పందించాలి



బాధితులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ

రాయచోటి : స్పందన కార్యక్రమం ద్వారా ప్రజలు అందిస్తున్న ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలని జిల్లా ఎస్పీ గంగాధర్‌రావు పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం అన్నమయ్య జిల్లా రాయచోటి పోలీసు ప్రధాన కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఎస్పీ ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లాలోని నలు మూలల నుంచి స్పందనకు 56 పిటీషన్లు అందాయని ఎస్పీ తెలిపారు. సమస్యలతో వచ్చిన ప్రజల ఎదుటనే ఆయా ప్రాంతాల పోలీసు అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై ఎస్పీ సూచనలు చేశారు.

ఆధునిక వంగడాలతో అధిక లాభాలు



రాగివిత్తనాలు పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్తలు

మదనపల్లె సిటీ : ఆధునిక వంగడాలతో అధిక లాభాలు పొందవచ్చునని కలికిరి కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) శాస్త్రవేత్త సోమశేఖర్ తెలిపారు. సోమవారం మదనపల్లె మండలం సిటీఎంలోని రైతుభరోసా కేంద్రంలో బయోఫోర్టిఫైడ్ ఇంద్రావతి రాగి రకం విత్తనాలపై రైతులకు అవగాహన, రైతులకు రాగి విత్తనాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ రకంలో ముఖ్యంగా కాల్షియం, ఐరన్, జింక్ అధికంగా ఉంటుందన్నారు. పోషక విలువలతో పాటు అగ్గితెగులు, పాము పొడ తెగులు తట్టుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త మాధురి, రైతుభరోసా కేంద్రం అధికారి సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎస్పీ 11వ బెటాలియన్ తనిఖీ

సిద్ధవటం : మండలంలోని భాకరాపేట గ్రామ సమీపంలో ఉన్న ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌ను సోమవారం కర్నూల్ రేంజి ఏపీఎస్పీ బెటాలియన్ల-3 డీఐజీ సీహెచ్. వెంకటేశ్వర్లు బెటాలియన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఐజీ ఆఫీస్, స్టోర్స్, యూనిట్ ఆసుపత్రి, ఆయుధాలను సందర్శించి తనిఖీ చేశారు. బెటాలియన్‌లోని పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో కమాండెంట్ శ్రీనివాసరావు, అడిషనల్ కమాండెంట్ కె. ప్రభుకుమార్, అసిస్టెంట్ కమాండెంట్లు, వి. కేశవరెడ్డి, వెంకట్‌రెడ్డి, పి.ఎస్.డి. ప్రసాద్, వి. జయప్రసాద్ ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, ఏఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



బెటాలియన్‌లో డీఐజీ వెంకటేశ్వర్లుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న పోలీసు అధికారులు

అన్నమాటకు కట్టుబడి..



నా పేరు ఎస్.భావన. మదనపల్లె మండలం సీటీఎం జెడీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నా. ప్రతి ఏడాది అమ్మ ఒడి కింద రూ.15వేలు జమ అవుతోంది. నాన్న శ్రీనివాసులు ప్రైవేటు బస్సు డ్రైవర్‌గా పని చేస్తున్నారు. అమ్మ కళావతి గృహిణి. చదువు కోసం సీఎం అమ్మ ఒడి దబ్బు ఎంతో మేలు చేస్తోంది. జగన్‌మామ మేలు మరవలేను.



నా పేరు షేక్ నాజియా. వాల్మీకిపురం మండలం చింతపర్తి ఎంపీపీ ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నా. నాన్న షేక్ అల్తాఫ్ కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నాం. నా చదువుకు అమ్మ ఒడి వస్తుండటంతో అమ్మానాన్నలు సంతోషంగా బడికి పంపుతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

- నాలుగో విడత 'అమ్మఒడి' విడుదలకు సర్కారు సిద్ధం
- 28న తల్లుల ఖాతాల్లో సొమ్ము జమ



మదనపల్లె సిటీ : పేదలను, అనాథలను పట్టించుకోని గత ప్రభుత్వాలతో విసుగెత్తిన ప్రజలకు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే అండగా నిలిచారు. విద్యా విధానంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు.నిరుపేదల కుటుంబాలకు పెద్ద దిక్కులా మారారు. మనసుంటే మార్గం ఉంటుందనే చందంగా 'అమ్మ ఒడి'పథకాన్ని తీసుకొచ్చి పేదల బిడ్డలకు అలంబన అయ్యారు.

బడిబాట పట్టించేలా


గతంలో చాలా మంది పేదలు ఆర్థిక సమస్యల కారణంగా పిల్లలను బడికి కాదని పనులకు పంపేవారు. ప్రజాసంకల్పయాత్రలో నిరుపేదల సమస్యలను ప్రత్యక్షంగా చూసిన వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే ప్రతి విద్యార్థి చదవాలనే ఉద్దేశంతో 'అమ్మఒడి'ని తీసుకొచ్చారు. చదువుకు పేదరికం అడ్డు కారాదంటూ ఆయన తీసుకున్న నిర్ణయం ఎంతో మంది కుటుంబాల్లో వెలుగులు నింపింది .గత ఏడాది జిల్లాలో 1,57,292 మంది విద్యార్థుల తల్లుల్లో రూ.235,93,80,000 జమ చేశారు. ఈఏడాది సుమారు 1,52,363 మంది లబ్ధి పొందనున్నారు.

అర్హతలు ఇవే...

తెల్లరేషన్ కార్డు కలిగి, ప్రభుత్వ లేదా ప్రైవేటు పాఠశాలల్లో చదివించే పిల్లలకు అమ్మ ఒడి పథకం వర్తిస్తుంది. ఒకటో తరగతి నుంచి ఇంటర్ చదివే విద్యార్థులకు ఈ పథకం కింద సాయం అందజేస్తారు. ఏడాదికి రూ.15 వేలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మొత్తంలో పాఠశాలల టాయిలెట్స్ నిర్వహణకు రూ. 2 వేలు మినహాయించి మిగిలిన రూ.13 వేలు విద్యార్థుల తల్లల ఖాతాల్లో జమ చేస్తారు. అమ్మ ఒడి పథకాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2020 జనవరి 26న ప్రారంభించింది. ఈనెల 28న వరుసగా నాలుగో ఏడాది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిధులు జమ చేయనున్నారు.

పేరెంట్స్ కమిటీ సమావేశాలు

అమ్మ ఒడి పథకాన్ని అమలు చేయనున్న నేపథ్యంలో సోమ, మంగళవారాల్లో పేరెంట్స్ కమిటీ సమావేశాలు నిర్వహించారు. సమావేశాల్లో జగనన్న ఆణిముత్యాలు గురించి వివరించాలి.



జిల్లాలో అమ్మఒడి పథకం వివరాలు

డివిజన్	అర్హులైన తల్లులు
మదనపల్లె	57,948
రాజంపేట	46,653
రాయచోటి	47762
మొత్తం	1,52,363

చదువుకు ఆర్థిక భరోసా



"ప్రభుత్వం ఏటా అమ్మ ఒడి పథకం కింద ఆర్థికసాయాన్ని నేరుగా తల్లుల ఖాతాల్లో జమ చేస్తోంది. ఈ ఏడాది నాలుగో విడత సొమ్మును అందజేసేందుకు అసరమైన చర్యలు తీసుకుంటోంది. ఈ పథకం పేద విద్యార్థులకు, వారి తల్లలకు ఆర్థిక భరోసా ఇస్తోంది.

– శ్రీరాం పురుషోత్తం, డీఈఓ, అన్నమయ్య జిల్లా.

టమాటా మార్కెట్‌లో జాక్‌పాట్ రద్దు

వేలంపాటలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన మార్కెటింగ్ జేడీ



మాట్లాడుతున్న మార్కెటింగ్ జేడీ రామాంజనేయులు

మదనపల్లె : టమాటా క్రయవిక్రయాలకు దేశంలోనే పేరుమోసిన మదనపల్లె మార్కెట్‌లో జాక్‌పాట్ విధానాన్ని పూర్తిగా రద్దుచేస్తున్నామని, ఎవరైనా చేస్తున్నట్లు తేలితే వారి లైసెన్సులు రద్దుచేసేందుకు వెనుకాడమని మార్కెటింగ్‌శాఖ జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులు హెచ్చరించారు. సోమవారం మదనపల్లెకు వచ్చిన ఆయన మార్కెట్‌యార్డులో టమాటా వేలంపాటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జాక్‌పాట్ విధానం అమలుపై రైతులను అడిగి తెలుసుకున్నారు. మార్కెట్‌లో రైతులు తీసుకొచ్చిన టమాటాకు లభిస్తున్న ధరలు, మండీయజమానులు తీసుకుంటున్న కమీషన్ గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మార్కెట్‌కమిటీ వైస్‌చైర్మన్ జి.వెంకటరమణ, డైరెక్టర్ తట్టిశ్రీనివాసులురెడ్డి, సెక్రటరీ అభిలాష్‌తో కలిసి మండీ యజమానులు, రైతులతో వేర్వేరుగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జేడీ రామాంజనేయులు మాట్లాడుతూ...రాష్ట్రంలోని అన్ని మార్కెట్‌యార్డుల్లో ఫ్రూట్స్, విజిటబుల్స్‌ను మార్కెట్ యాక్ట్ నుంచి తొలగించినందున కమిషన్ ఏజెంట్ లైసెన్స్‌లను ప్రభుత్వం తొలగించిందన్నారు. మార్కెట్‌యార్డుల్లో వలంటరీ ట్రేడింగ్ నిర్వహించాల్సి ఉంటుందన్నారు. మిగతా మార్కెట్లతో పోలిస్తే మదనపల్లె మార్కెట్‌లో టమాటాకు అధికధరలు పలుకుతున్నాయన్నారు. రైతుల సంక్షేమానికి మార్కెట్‌కమిటీ అధికారులు, సిబ్బంది, పాలకవర్గంతో పాటుగా మండీ యజమానులు సహకరించాలని కోరారు. దీనిపై మండీ యజమానులు మాట్లాడుతూ... మార్కెట్లో జాక్‌పాట్ విధానం కేవలం కొన్ని చిన్న మండీల్లో మాత్రమే జరుగుతోందని, సోమవారం నుంచి పూర్తిగా ఎత్తేసేందుకు సుముఖత వ్యక్తం చేశారు. కమీషన్ వసూలుపై రాష్ట్రంలోని అన్ని మార్కెట్లకు సంబంధించి ప్రభుత్వం అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటే బాగుంటుందన్నారు. కేవలం మదనపల్లె మార్కెట్‌లోనే కాకుండా జిల్లాలోని ఇతర మార్కెట్లలోనూ ఇవే నిబంధనలు అమలుపరిస్తే అందరికీ అనుకూలంగా ఉంటుందన్నారు. దీనిపై మిగతా మార్కెట్ల అధికారులతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని జేడీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డైరెక్టర్ ప్యారేజాన్, మండీ యజమానుల సంఘం అధ్యక్షులు జయరామిరెడ్డి, సురేంద్ర, వర్మ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితాలు చిత్తు



మిట్స్ కళాశాలలో మాట్లాడుతున్న జడ్జి అబ్రహాం

కురబలకోట : మాదక ద్రవ్యాల (డ్రగ్స్)కు బానిసై యువత భవిష్యత్తును చిత్తు చేసుకోవద్దని మదనపల్లె అడిషినల్ జిల్లా జడ్జి బి.అబ్రహాం పేర్కొన్నారు. అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ. మంజులత, అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి జిసి అసీఫా సుల్తానా, మదనపల్లె డీఎస్పీ కేశప్ప పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్జి అబ్రహాం మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు శారీరక, మానసిక రుగ్మతలను కల్గిస్తాయన్నారు. మత్తుకు అలవాటుపడటం మరణంతో సమానమన్నారు. అది క్రమేణా మనిషిని నిర్వీర్యం చేస్తుందని గుర్తించాలన్నారు. డీఎస్పీ కేశప్ప మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం మహా ముప్పు అని గుర్తించాలన్నారు. వీటికి విద్యార్థులు, యువత దూరంగా ఉండాలని కోరారు. కళాశాలలో మొక్కలు నాటారు.

చంద్రబాబు వస్తే సంక్షేమ పథకాలన్నీ తొలగిస్తాడు

ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

గుర్రంకొండ : చంద్రబాబు మళ్లీ పొరబాటున అధికారంలోకి వస్తే జగనన్న ప్రజలకిస్తున్న సంక్షేమ పథకాలన్నింటినీ తొలగిస్తాడని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిలు అన్నారు. సోమవారం మండలంలోని సరిమడుగు పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 14 ఏళ్లు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు రాష్ట్ర అభివృద్ధికి చేసింది శూన్యమన్నారు. 2014లో అధికారంలోకి వచ్చినప్పుడు ప్రజలకు ఇచ్చిన హామీలు ఎన్ని నెరవేర్చారో చెప్పాలని ప్రశ్నించారు. జిల్లాకు ఒక్క ప్రాజెక్టు అయినా తీసుకొచ్చారా అని అన్నారు. జిల్లాకు రెండు ప్రాజెక్టులు తీసుకొస్తే వాటికి టీడీపీ నాయకులు అడ్డంకులు సృష్టించి రైతులకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. బూటకపు హామీలు ఇచ్చినంత మాత్రనా చంద్రబాబును ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్ని మళ్లీ కొనసాగాలి అంటే జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. ఎన్ని కష్టాలు ఎదుర్కొంటున్నా క్రమం తప్పకుండా ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు అన్ని పథకాలను ఇస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌హన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అందరికి మంచి చేసే జగనన్నను మరోసారి మహిళలు ఆశీర్వదించి ముఖ్యమంత్రిని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ కార్పోరేషన్ చైర్మెన్ ఇక్బాల్ అహ్మద్, రాష్ట్ర ఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి, ఏపీ రెడ్డిసంఘం గౌరవాధ్యక్షులు నారదరెడ్డిలు పాల్గొన్నారు.

నేటి నుంచి సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలు



విద్యుద్దీపాలంకరణలతో నందలూరు సౌమ్యనాథాలయం



ముత్యాల తలంబ్రాలను తీసుకొస్తున్న ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి

4న కల్యాణం, 5న రథోత్సవం

నందలూరు(రాజంపేట) : అన్నమయ్య జిల్లాలో ప్రసిద్ధి చెందిన నందలూరు సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభంకానున్నాయి. టీటీడీలో విలీనం తర్వాత తొలిసారిగా బ్రహ్మోత్సవాలను నిర్వహించేందుకు సర్వంసిద్ధం చేశారు.ఈ నెల 27 నుంచి 7 వరకు బ్రహ్మోత్సవాలు కొనసాగనున్నాయి. తొలిరోజు సాయంత్రం అంకుర్పారణ కార్యక్రమం నిర్వహించనున్నారు.

కార్యక్రమాలిలా..

28న ధ్వజారోహణం, 2న గరుడసేవ, 4న కల్యాణోత్సవం, 5న రథోత్సవం, 6న చక్రస్నానం. 07న పుష్పయాగం కార్యక్రమాలను టీటీడీ నిర్వహిస్తుంది. కల్యాణోత్సవంలో పాల్గొనే దంపతులు రూ.500 చెల్లించి పాల్గొనాలని టీటీడీ కోరింది.

వాహనసేవలిలా..

28న యాళివాహనం, 29న హంసవాహనం, 30న సింహవాహనం, 01న హనుమద్వాహనంము, 2న గరుడవాహనం, 3న చంద్రప్రభవాహనం, 4న గజ వాహనం, 5న అశ్వవాహనాలపై సౌమ్యనాథుడు భక్తులకు దర్శనమివ్వనున్నారు. ప్రతి రోజు సాయంత్రం ఊంజల్‌సేవ(డోలోత్సవం), ఉదయం స్నపన తిరుమంజనం కార్యక్రమాలను నిర్వహిస్తారు.

ముత్యాల తలంబ్రాలు అందజేత

వచ్చేనెల 4న నందలూరు సౌమ్యనాథాలయంలో జరిగే స్వామివారి కల్యాణానికి తమ సొంత నిధులతో ముత్యాల తలంబ్రాలను తిరుమల తిరుపతి దేవస్థానానికి మండలాధ్యక్షుడు మేడావిజయ భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మేడాపద్మజ దంపతులు అందజేశారు. సోమవారం ఆలయానికి చేరుకున్న వీరికి అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆలయ సంప్రదాయపద్ధతిలో ముత్యాల తలంబ్రాలను టీటీడీ టెంపుల్స్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లయ్యకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అరిగెల నాని, సోమిశెట్టి ప్రభాకర్, నడివీధిసుధాకర్, పెనుబాలనాగసుబ్బయ్య, తుమ్మల శ్రీధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అర్జీలకు సకాలంలో పరిష్కారం

అధికారులకు కలెక్టర్ ఆదేశం



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి : జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం ద్వారా వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్‌తోపాటు జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్ఓ సత్యనారాయణలు హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చెప్పారు. జగనన్న సురక్ష సర్వీసెస్‌పై సర్వే బాగా చేస్తున్నారని, ఈ కార్యక్రమంలో ఇప్పటి వరకు 5280 సర్వీస్ రిక్వెస్ట్‌లు వచ్చాయని, ఇందులో 1280 రిజిస్టర్ చేశారన్నారు. మిగిలిన 4 వేలు వెంటనే అప్‌లోడ్ చేయాలని సూచించారు. అనంతరం ప్రజల నుంచి కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. వాల్మీకిపురం మండలం, మూరేవాండ్లపల్లి పంచాయతీ, బర్నేపల్లి హరిజనవాడకు స్మశానం ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతూ జిల్లా కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు. రామాపురం మండలం, కసిరెడ్డిగారిపల్లి పంచాయతీ, వడ్డెపల్లికి చెందిన ఆర్ సుబ్బరాయుడు తనకు జగనన్న లేఅవుట్ కాలనీలో ఇంటిస్థలంతోపాటు ఇల్లు మంజూరుచేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. రామాపురం మండలం, ఓబులరెడ్డిగారిపల్లె హరిజనవాడకు చెందిన బి నందినీ తనకు లే లక్కిరెడ్డిపల్లె బాలికల గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ బైపీసీ చదువుకొనుటకు సీటు ఇప్పించవలసిందిగా కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ మెడికల్ ఆఫీసర్లతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వైద్యులు, సిబ్బంది రోగులకు మెరుగైన వైద్యం అందించి అవసరమైన మందులు ఇవ్వాలన్నారు. ప్రతిరోజు ఆసుపత్రికి ఎంతమంది రోగులు వస్తున్నారు. వ్యాధి వివరాలు, వారికికి ఏమేమి మందులు ఇచ్చారు, తదితర వివరాలన్నీ రికార్డులలో ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య, మెడికల్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు వరం..లా నేస్తం

- ఆర్థికసాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్



జూనియర్ న్యాయవాదులతో కలిసి సీఎం ప్రసంగాన్ని వింటున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి : జూనియర్ న్యాయవాదులను ప్రోత్సహిస్తూ.. వృత్తిలో స్థిరపడేలా ప్రభుత్వం 'వైఎస్ఆర్ లా నేస్తం'ద్వారా ఆర్థిక సహాయాన్ని అందిస్తోందని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అన్నారు. సోమవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి 'వైఎస్ఆర్ లా నేస్తం'ద్వారా రాష్ట్రంలోని అర్హులైన 2,677 మంది జూనియర్ న్యాయవాదు నెలకు రూ.5 వేలు చొప్పున.. ఫిబ్రవరి 2023 నుంచి జూన్ 2023 వరకు రూ.25 వేలు చొప్పున వారి ఖాతాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నగదు జమ చేశారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, గ్రామ, వార్డు సచివాలయ జిల్లా కోఆర్డినేటర్ మనోహర్‌రాజు, న్యాయవాదులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ పథకం కింద రాష్ట్రంలో అర్హులైన 2,677 మంది జూనియర్ న్యాయవాదులకు ఆర్థిక సహాయం ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. వృత్తిపరంగా యువ న్యాయవాదుల ఇబ్బందులను గుర్తించిన సీఎం వైఎస్ జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీలో భాగంగా 'వైఎస్ఆర్ లా నేస్తం'పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. అర్హులైన యువ న్యాయవాదులకు మూడేళ్ల పాటు నెలకు రూ.5 వేలు చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నారన్నారు. రూ.100 కోట్ల కార్పస్ ఫండ్‌తో అడ్వకేట్స్ వెల్ఫేర్ ట్రస్టును ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఈ పథకాన్ని మరింత సమర్థవంతంగా పర్యవేక్షించేలా ఏకకాలంలో యువ న్యాయవాదులు పెద్ద మొత్తంలో సొమ్ము అందుకుని వారి అవసరాలు తీర్చుకునేందుకు ఉపయోగపడేలా ప్రతి ఆరు నెలలకోసారి బటన్ నొక్కి లబ్ధి అందించేలా పథకంలో మార్పులు చేశారన్నారు. ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయాన్ని యువ న్యాయవాదులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం



పాదయాత్రలో ఇచ్చిన హామీలో భాగంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'వైఎస్ఆర్ లా నేస్తం'పథకం ప్రవేశపెట్టి నెలకు రూ.5 వేలు చొప్పున ఆర్థిక సహాయం అందివ్వడం హర్షణీయం. అర్హత కలిగిన యువ న్యాయవాదులకు మూడేళ్ల పాటు నగదు ఇవ్వడం అభినందనీయం. వంద కోట్ల రూపాయలతో కార్పస్ ఫండ్‌తో అడ్వకేట్స్ వెల్ఫేర్ ట్రస్టను ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

– విసి రెడ్డప్పరెడ్డి, వైఎస్ఆర్‌సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు,అన్నమయ్య జిల్లా

న్యాయ సమాచారం కోసం ఉపయోగం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 2వైఎస్ఆర్ లా నేస్తం'ద్వారా అందిస్తున్న ఆర్థికసాయంతో మరింత న్యాయ సమాచారాన్ని తెలుసుకొనే అవకాశం లభించింది. చట్టపరమైన సమాచారం తెలుసుకోవడానికి కావాల్సిన బుక్స్‌ను, స్టేషనరీని ఈ నిధులతో కొనుగోలు చేస్తాను.

– బుక్కే తేజస్విని, జూనియర్ న్యాయవాది

సమస్యలకు పరిష్కారం దొరికింది



జూనియర్ న్యాయవాదులుగా ఉన్న సమయంలో వృత్తిపరంగా ఎదురయ్యే చిన్న చిన్న ఆర్థిక సమస్యలకు వైఎస్ఆర్ లా నేస్తం తోడుగా నిలుస్తుంది. స్కూటర్‌ను పెట్రోల్ ఖర్చు నుంచి జిరాక్సులు చిన్న చిన్న రికార్డ్స్ బుక్స్ కొనుగోలుకు ఎంతో ఉపయోగకరంగా ఉంది.

– సయ్యద్ బాషా, జూనియర్ న్యాయవాది

వైఎస్ఆర్‌సీపీ నేత హత్య కేసులో ఆరుగురి అరెస్ట్

కడప అర్బన్ : వైఎస్ఆర్‌సీపీ నాయకుడు, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న చిన్ననాగిరెడ్డిగారి శ్రీనివాసులరెడ్డి(42) హత్య కేసులో ఆరుగురిని అరెస్ట్ చేశారు. శ్రీనివాసులరెడ్డిని ఈ నెల 23న ఉదయం 8:10 గంటల సమయంలో కడప నగరం ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సంధ్యా సర్కిల్ సమీపంలో దారుణంగా హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ సంఘటనలో ప్రధాన నిందితుడు మోపురు ప్రతాప్‌రెడ్డితోపాటు మరో ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం కడపలోని జిల్లా పోలీసు కార్యాలయం వద్ద వున్న 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో నిందితులను తీసుకుని వచ్చి హాజరు పరిచారు. ఈ సంఘటనపై జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ విలేకరులకు వివరాలు తెలియజేశారు. అరెస్టయిన వారిలో పెండ్లిమర్రి మండలం కొండూరుకు చెందిన ప్రధాన నిందితుడు మోపురు ప్రతాప్‌రెడ్డి ప్రస్తుతం కడపలో జిల్లా కోర్టు కాంప్లెక్స్ వెనుకభాగాన ఓ ఇంటిలో నివాసం వుంటున్నాడు. రెండవ నిందితుడు కడప పాలెంపల్లికి చెందిన మేరువ శ్రీనివాసులు ప్రస్తుతం సాయిపేటలో నివాసం వుంటున్నాడు. మూడవ నిందితుడు కడప నగరంలోని పాతకడపకు చెందిన కల్లూరు సురేష్‌కుమార్ అలియాస్ ఫ్రాన్సిస్, కడప నగర శివార్లలోని పుచ్చలపల్లి సుందరయ్యకాలనీకి చెందిన బరకం హరిబాబు, కడప నగరంలోని శంకరాపురంలో నివాసముంటూ వార్డు వలంటీర్‌గా వున్న కోనేరు వెంకటసుబ్బయ్య, కడప నగరం పాతకడపకు చెందిన పత్తూరు భాగ్యరాణి వున్నారు. గతంలో శ్రీనివాసులరెడ్డితో కలిసి ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాసులు కడప చుట్టుపక్కలా, ఇతర ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశారు. ఈ విషయంలో వారికి విభేదాలు తలెత్తాయి. దీంతో శ్రీనివాసులరెడ్డిని హత్య చేసేందుకు తనతో పాటు వున్న మేరువ శ్రీనివాసులు, నిందితురాలు భాగ్యరాణి పరిచయం చేసిన మిగిలిన నిందితులతో కలిసి ప్రతాప్‌రెడ్డి పథకం పన్నాడు. కల్లూరు సురేష్‌కుమార్ అలియాస్ ఫ్రాన్సిస్, బరకం హరిబాబు, వెంకటసుబ్బయ్యతో పరిచయం చేసుకుని హత్యకు కుట్ర పన్నారు. ఈ పథకంలో భాగంగానే ఈనెల 23న ఉదయం మోపురు ప్రతాప్‌రెడ్డి, సురేష్‌కుమార్ అలియాస్ ఫ్రాన్సిస్ బురఖాలు ధరించారు. తమతోపాటు మారణాయుధాలైన బాకు, కత్తిని, కొడవలిని తీసుకున్నారు. శ్రీనివాసులరెడ్డి కదలికలను గమనించారు. శ్రీనివాసులరెడ్డి రాబిట్ ఫిట్‌నెస్‌కు వెళ్లినప్పటి నుంచి బయటకు వచ్చేంత వరకు కాపుకాశారు. అతను రాగానే మృతుడి రాయల్‌ఎన్‌ఫీల్డ్ మోటార్ సైకిల్‌కు కోనేరు వెంకటసుబ్బయ్య తన మోటార్ సైకిల్‌ను అడ్డు పెట్టాడు. అప్పటికే బురఖాలు ధరించి కత్తులు చేతపట్టిన ప్రతాప్‌రెడ్డి, సురేష్‌కుమార్ అలియాస్ ఫ్రాన్సిస్ ఒక్కసారిగా శ్రీనివాసులరెడ్డిపై దాడి చేశారు. శ్రీనివాసులరెడ్డి ఛాతీకి, గుండెకు బలమైన గాయాలు కావడంతో కొంతదూరం వెళ్లి కుప్పకూలిపోయాడు. హత్య జరిగిన మోటార్‌సైకిల్‌పై ప్రతాప్‌రెడ్డి, ఫ్రాన్సిస్ ఊరిబయటికి వెళ్లిపోయారని ఎస్పీ తెలిపారు. కేసు విచారణ చేపట్టి నిందితులను అరెస్ట్ చేశామన్నారు.

నడిరోడ్డుపై తెలుగు తమ్ముళ్ల ఓవర్‌యాక్షన్

- 30 పోలీస్‌యాక్ట్ అమల్లో ఉన్నప్పటికీ టీడీపీ నేతలు బేఖాతర్
- సబ్ కలెక్టరేట్ ఎదుట బైఠాయింపు
- ఇబ్బందులు పడ్డ విద్యార్థులు, రోగులు
- అడ్డుకున్నందుకు డీఎస్పీ, పోలీసులపై జులుం



ఏఎస్ఐ ఆదినారాయణని బెదిరిస్తూ, వార్నింగ్ ఇస్తున్న టీడీపీ నాయకులు



మదనపల్లె-చిత్తూరు ప్రధాన రహదారిపై అనుమతి లేకుండా బైఠాయించిన టీడీపీ నాయకులు

మదనపల్లె : మదనపల్లె–చిత్తూరు ప్రధాన రహదారిపై సబ్‌కలెక్టరేట్ ఎదుట సోమవారం తెలుగు తమ్ముళ్లు ఒక్కసారిగా ఓవర్‌యాక్షన్ మొదలుపెట్టారు. నడిరోడ్డుపై ధర్నా చేసేందుకు పోలీసుల అనుమతి తీసుకోకుండానే, తమను ఎవరు అడ్డుకుంటారనే ధీమాతో నిస్సిగ్గుగా రోడ్డుపై బైఠాయించారు. పబ్లిసిటీ పిచ్చితో, అనుకూల మీడియా అండగా ఉందనే ధైర్యంతో.. ప్రజలు ఎవరూ పట్టించుకోకున్నా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆధిపత్యాన్ని ప్రదర్శించారు. మదనపల్లె సబ్‌డివిజన్‌లో 30 పోలీస్‌యాక్ట్ అమల్లో ఉన్నప్పటికీ బేఖాతర్ చేస్తూ దాదాపు 20 నిమిషాలకు పైగానే నిరసన తెలిపారు. దీంతో వైద్యసేవలకు ఆస్పత్రికి వెళ్లాల్సిన రోగులు, డిగ్రీ పరీక్షలు రాసేందుకు వెళ్లాల్సిన విద్యార్థులు, చిత్తూరు వైపుగా వెళ్లే బస్సుల్లోని ప్రయాణికులు, సామాన్యప్రజలు అవస్థలు పడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు వచ్చి ప్రధాన రహదారిపై అనుమతి లేకుండా ధర్నా నిర్వహించడం చట్టవిరుద్ధమని, వారిని లేపేందుకు ప్రయత్నిస్తే డీఎస్పీ స్థాయి అధికారి, పోలీసులపైనా జులుం ప్రదర్శిస్తూ.. వైఎస్ఆర్‌సీపీ పోలీసులు డౌన్‌డౌన్ అంటూ అధికారులకు రాజకీయాలు అంటగట్టే ప్రయత్నం చేశారు. టీడీపీ నాయకులు మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, రాష్ట్ర తెలుగుయువత అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు ఆధ్వర్యంలో చీకలబైలు ప్రొటోకాల్ విషయమై జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా సబ్ కలెక్టరేట్‌లో ఆర్డీఓకు ఫిర్యాదు చేసేందుకు నాయకులు, కార్యకర్తలు చేరుకున్నారు. నేరుగా ఆర్డీఓ వద్దకు వెళ్లి అర్జీ సమర్పించి సమస్యను చెప్పుకునే అవకాశం ఉన్నప్పటికీ... కావాలనే అందరినీ కూడగట్టుకుని సబ్ కలెక్టరేట్ బయటకు వచ్చి రోడ్డుపై కూర్చుని వాహనాలను అడ్డగించి ధర్నాకు ఉపక్రమించారు. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసులు సబ్‌కలెక్టరేట్ వద్దకు చేరుకుని రోడ్డుపై నిరసన తెలపడం తగదని, ట్రాఫిక్‌జామ్ అవుతుందని తెలిపినా పట్టించుకోకుండా నినాదాలు చేశారు. పోలీసులు డీఎస్పీ కేశప్పకు సమాచారం అందిస్తే ఆయన హడావిడిగా అక్కడకు చేరుకుని 30 పోలీస్‌యాక్ట్ అమల్లో ఉందని, రోడ్డుపై అనుమతి లేకుండా ధర్నాలు, సమావేశాలు, నిరసన తెలపడం చట్టవిరుద్ధమని తెలిపితే... పోలీసు జులుం నశించాలి, వైఎస్ఆర్‌సీపీ పోలీసులు డౌన్‌డౌన్ అంటూ ఎదురుతిరిగారు. దీంతో డీఎస్పీ కేశప్ప నాయకులను అరెస్ట్ చేయాల్సిందిగా ఆదేశిస్తే పోలీసులకు సహకరించకపోగా, పైపెచ్చు వారినే బెదిరిస్తూ, చేతులు చూపిస్తూ తోపులాటకు దిగారు. డీఎస్పీ పట్టుకునేందుకు ప్రయత్నిస్తే టీడీపీ నాయకుడు దొరస్వామినాయుడు ఆయనను బలంగా నెట్టివేశాడు. తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్‌చినబాబు పోలీసులపైనే పళ్లు కొరుకుతూ.. 'ఏం తమాషా చేస్తున్నావా.. ఆరు నెలలు తట్టుకో.. మేం ఏంటో చూపిస్తామంటూ' బెదిరిస్తే... అతడి పక్కన ఉన్న నాయకుడు ఖాన్ చేయి చూపిస్తూ ఏఎస్ఐ ఆదినారాయణకు వార్నింగ్ ఇచ్చాడు. తమ్ముళ్ల తోపులాటలో ఏఎస్ఐ ఆదినారాయణ యూనిఫాంకు ఉన్న నేమ్‌ప్లేట్‌ను పీకేసి నెట్టేశారు. కార్యకర్తలందరితో కలిసి సబ్‌కలెక్టరేట్‌లో వీరంగం సృష్టించారు. దీంతో పోలీసులు బలవంతంగా వారిని జీపుల్లోకి ఎక్కించి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. డీఎస్పీ కేశప్ప మాట్లాడుతూ... పోలీసు అనుమతి లేకుండా టీడీపీ నాయకులు ధర్నా నిర్వహించడమే కాకుండా చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని తమపైనే బెదిరింపులకు పాల్పడ్డారన్నారు. చట్టాన్ని అతిక్రమిస్తే పోలీసులకు ఎవరైనా ఒకటేనని, తమకు పార్టీలతో ప్రమేయం ఉండదన్నారు. సబ్‌డివిజన్‌లో 30 పోలీస్‌యాక్ట్ అమలులో ఉన్నందున చట్టాన్ని అతిక్రమించిన వ్యక్తులపై నాన్‌బెయిలబుల్ సెక్షన్లపై కేసు నమోదు చేయడమే కాకుండా అవసరమైతే లాఠీచార్జి చేసే అధికారం తమకు ఉందన్నారు. అనంతరం వన్‌టౌన్ స్టేషన్‌లో టీడీపీ నాయకులు 13 మందిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ మహబూబ్‌బాషా తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



తబ్రేజా ఆలం (ఫైల్)

ములకలచెరువు : ఒక వ్యక్తి అదృశ్యమైన ఘటనపై సోమవారం ములకలచెరువు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఎస్ఐ గాయత్రి కథనం మేరకు.. మండలంలోని సోంపల్లెకు చెందిన ఎస్.తబ్రేజా ఆలం (50) ఈ నెల 23న ఇంటిలో నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి అయినా తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు.. బంధువుల ఊర్లకు వెళ్లి వెతికినా ఆచూకీ లభించలేదు. ఎస్.తబ్రేజా ఆలం కుమారుడు ఎస్.శంషాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు శిక్ష

రాయచోటి టౌన్ : డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు శిక్ష పడింది. రాయచోటి పట్టణ శివార్లలో ట్రాఫిక్ ఎస్ఐ మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. సుండుపల్లె మండలం సీతంపేట కొత్తపల్లెకు చెందిన వల్లిపోగు ఆంజనేయులు, రాయచోటి పట్టణానికి చెందిన షేక్ బాబ్జి, సంబేపల్లె మండలం కొండవాండ్లపల్లె గ్రామం నారాయణరెడ్డిగారిపల్లెకు చెందిన దేరంగుల రామచంద్ర మద్యం తాగి వాహనాలు నడుపుతుండగా పట్టుకున్నారు. వీరిని కోర్టులో హాజరు పరిచారు. నిందితులకు ఏజేఎఫ్‌సీఎం డాక్టర్ ఎస్ఎంటీకే శారద మూడు రోజులు జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

దంపతుల ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబ సమస్యలతో దంపతులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఆదివారం రాత్రి పట్టణంలో జరిగింది. ఇందిరానగర్‌కు చెందిన సయ్యద్‌పీర్ కుమారుడు సయ్యద్ మహబూబ్‌బాషా(38) బియ్యం వ్యాపారం చేస్తూ జీవిస్తున్నాడు.

భార్య యాస్మిన్(33)తో గత కొంత కాలంగా కుటుంబ సమస్యలతో విభేదాలు నడుస్తున్నాయి. ఈ విషయంగా తరచూ గొడవ పడుతున్నారు. ఆదివారం రాత్రి మరోసారి దంపతుల మధ్య గొడవ జరిగి తారాస్థాయికి చేరడంతో యాస్మిన్ నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, వెంటనే భర్త సయ్యద్ మహబూబ్‌బాషా సైతం నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు చికిత్సలు చేసి పరిస్థితి విషమంగా ఉండటంతో బెంగళూరుకు రెఫర్ చేశారు.

రైతన్నల గొప్పతనాన్ని గుర్తించాలి



మాట్లాడుతున్న మాజీ జేడీ లక్ష్మీనారాయణ

బి.కొత్తకోట/ కురబలకోట : చెమట చుక్కలతో పంటలు పండించి జాతికి మెతుకులను అందించే కష్ట జీవులైన రైతన్నల గొప్పతనాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాల్సిన అవసరం ఉందని సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ అన్నారు. బి.కొత్తకోట మండలంలోని పెద్దపల్లె గ్రామం వద్ద కార్తికేయ ఫార్మ్ హౌస్‌లో సోమవారం వెలుగు స్కూల్ సెక్రటరీ ఉదయ్ మోహన్‌రెడ్డి, కన్వీనర్ ఆర్.భాగ్యలక్ష్మి నేతృత్వంలో రైతు పూజోత్సవం, ఏరువాక పౌర్ణమి నిర్వహించారు. జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథి గా మాట్లాడుతూ రైతుల కష్టనష్టాల గురించి తెలుసుకోడానికి తాను కూడా కౌలు రైతుగా మారానన్నారు. వ్యవసాయం చేస్తున్నానన్నారు. ప్రతి ఏటా ఏరువాక పౌర్ణమి రోజుల్లో జేడీ ఫౌండేషన్ ద్వారా ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో రైతులను సన్మానించడం జరుగుతోందన్నారు. లాభమో.. నష్టమో దేశానికి అన్నం అందించడానికి ఎండ, వాన, చలి మరో వైపు కరెంటు షాక్, పాము కాటు ఇతర ప్రమాదాలను లెక్కచేయక అహర్నిశలు రైతులు కష్టపడతారన్నారు. కరోనా సమ యంలో ప్రపంచమంతా స్తంభించినా ఒక్క రైతన్న శ్రమ మాత్రం ఆగలేదన్నారు. ఇలాంటి రైతులకు ఏమిస్తున్నామో ఆలోచించాలన్నారు. దేశానికి వెన్నెముక రైతన్నలేనన్నారు. వ్యవసాయం లేనిదే మానవ మనుగడ లేదంటే అతిశయోక్తి కాదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ సబ్సిడీలు, సంక్షేమ పథకాలు ఇస్తున్నా రైతులకు మరింత చేయూతను ఇవ్వాల్సి అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. రైతులు కూడా పురుగు మందులు లేని ఆహారాన్ని పండించాలన్నారు. ప్రకృతి సేద్యం వైపు అడుగులు వేయాలన్నారు. ముఖ్యంగా నేల తల్లిలో జీవం తగ్గకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా జేడీ ఫౌండేషన్ టీమ్ రైతులు భవాని, బి.శ్రీకాంత్‌రెడ్డి, కె.సహదేవరెడ్డి, బి. చంద్రారెడ్డి, ఎన్.రఘునాథరెడ్డి సన్మానించారు. మహిళా రైతులకు చీరలను పంపిణీ చేశారు.

నలుగురు గంజాయి విక్రయదారులపై పీడీ యాక్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ గంగాధర్‌రావు

రాయచోటి : యువతను మత్తులో ముంచి జీవితాలను నాశనం చేస్తున్న గంజాయి విక్రయదారులపై పోలీసులు పీడీ యాక్ట్ కేసులు నమోదు చేశారు. అన్నమయ్య జిల్లా రాయచోటి పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్పీ గంగాధర్‌రావు వివరాలు వెల్లడించారు. జిల్లాలో గంజాయి, ఇతర మత్తు పదార్థాలను పూర్తి స్థాయిలో అరికట్టి గంజాయి రహిత జిల్లాగా మార్చాలన్నదే పోలీసుల ధ్యేయమన్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా గంజాయి విక్రయిస్తూ యువతను పెడదారి పట్టిస్తున్న వారిని గుర్తించామన్నారు. వారిపై పలుమార్లు కేసులు నమోదు చేసి కౌన్సెలింగ్ ఇచ్చినప్పటికీ ఫలితం లేకపోవడంతో నలుగురిపై పీడీయాక్టు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. రాయచోటికి చెందిన కత్తి వినయ్‌కుమార్ (22), షేక్ దిల్షాద్ (45), కురబలకోట మండలం అంగళ్లకు చెందిన నూర్ మహ్మద్ (60), రాజంపేట మండలం బోయనపల్లికి చెందిన తొండేటి శేఖర్‌బాబు (40)పై పీడీ యాక్టు ప్రయోగించామని పేర్కొన్నారు. గంజాయి కారణంగా కళాశాలలు, పాఠశాలల్లో యువత మత్తుకు బానిస కాకుండా ఉండేలా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. మత్తు పదార్థాలు వాడకం వలన కలిగే నష్టాల గురించి హోర్డింగ్‌లు, కరపత్రాల ద్వారా చైతన్య పరుస్తున్నట్లు చెప్పారు. విక్రయదారుల సమాచారం ఉంటే టోల్ ఫ్రీ నంబరు 14500 కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అడిషనల్ ఎస్పీ రాజ్ కమల్, రాయచోటి డీఎస్పీ మహబూబ్ బాషా, సీఐలు సత్యనారాయణ, సుధాకర్‌రెడ్డి, రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా బక్రీద్ జరుపుకొందాం

రేపటి నుంచి ప్రారంభమయ్యే బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా ఎస్పీ గంగాధర్ రావు సూచించారు. పండుగను దృష్టిలో ఉంచుకొని కొంత మంది ఆకతాయిలు సోషల్ మీడియా ఆధారంగా చేసే దుష్ప్రచారాలు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. తప్పుడు ప్రచారాలను చేసే వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. సోదర భావంతో శాంతియుత వాతావరణంలో పండుగను జరుపుకోవాలని, అందరూ కలిసిమెలసి జీవనం సాగించేలా జిల్లా ప్రజలు సహకరించాలని ఎస్పీ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

ఆటో, బైక్ ఢీకొని ఒకరి మృతి

రాయచోటి టౌన్ : రాయచోటి – మదనపల్లె రోడ్డులోని ఏజీ గార్డెన్ సమీపాన మలుపు వద్ద ఆటో, బైక్ ఢీకొనడంతో ఒకరు మృతి చెందారు. ట్రాఫిక్ ఎస్ఐ మహమ్మద్ రఫీ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం రాత్రి ఏజీ గార్డెన్ దిగువ భాగాన మైన్స్‌లో పని చేసే గణేష్(24) బైక్‌పై స్వగ్రామం అయిన మాధవరానికి వెళ్లేందుకు రాయచోటి వైపు వస్తున్నాడు. రాయచోటి పట్టణం నుంచి ఏజీ గార్డెన్ వైపు ఆటో వెళ్తోంది. ఈ మలుపు వద్ద ఈ రెండు వాహనాలు ఢీకొనడంతో గణేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని ట్రాఫిక్ ఎస్ఐ తెలిపారు.

కొడుకుపై తండ్రి దాడి



గాయపడ్డ రాము

మదనపల్లె : కన్నకొడుకుపై ఓ తండ్రి విచక్షణారహితంగా బ్లేడు, కత్తితో దాడి చేసిన ఘటన ఆదివారం రాత్రి బి.కొత్తకోట మండలంలో జరిగింది. గోళ్లపల్లెకు చెందిన రాము తన భార్య కళావతిని 15 ఏళ్ల క్రితం వదిలేశాడు. ఆమె అప్పటి నుంచి మదనపల్లెలో కుమారుడు బాలు(20)తో కలిసి భవన నిర్మాణ పనులు చేసుకుంటూ బసినికొండలో నివాసం ఉంటోంది. ఆదివారం రాత్రి గోళ్లపల్లెలో ఉన్న నాయనమ్మ కమలమ్మను చూసేందుకు బాలు వెళ్లాడు. అక్కడే మద్యం మత్తులో ఉన్న తండ్రి రాము తన ఇంటికి ఎందుకు వచ్చావంటూ బాలుతో గొడవపడ్డాడు. పట్టరాని ఆగ్రహంతో ఊగిపోతూ.. కత్తి, బ్లేడుతో శరీరంపై పలుచోట్ల గాట్లు పెట్టి దాడి చేశాడు. స్థానికులు అడ్డుకోవడంతో అక్కడి నుంచి పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన బాలును కుటుంబ సభ్యులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అయితే సోమవారం ఉదయం కుమారుడు బాలును చూసేందుకు రాము ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చాడు. అక్కడ బాలు తల్లి కళావతి, ఆమె కుటుంబసభ్యులు అతడిపై దాడి చేసి కొట్టారు. అక్కడే ఉన్న సెక్యూరిటీ సిబ్బంది వారిని వారించి రామును ఆస్పత్రి నుంచి పంపించి వేశారు. దీంతో వివాదం సద్దుమణిగింది. అవుట్ పోస్ట్ సిబ్బంది సమాచారాన్ని బి.కొత్తకోట పోలీసులకు తెలిపారు.

మహిళపై దాడి

భూవివాదం కారణంగా మహిళపై దాడి చేసి గాయపరిచిన సంఘటన సోమవారం పెద్దమండ్యం మండలంలో జరిగింది. మిట్టమోళ్లపల్లెకు చెందిన ఈశ్వరమ్మ(56) భూమిని అదే గ్రామానికి చెందిన చిన్నప్ప వర్గీయులు ఆక్రమించుకుని దుక్కి దున్నేందుకు ప్రయత్నించగా ఆమె అడ్డుకుంది. దీంతో ఆగ్రహించిన వారు ఆమెపై దాడిచేశారు. గాయపడిన బాధితురాలిని కుటుంబసభ్యులు మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పెద్దమండ్యం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కారు బోల్తా.. నలుగురికి గాయాలు

రామాపురం : కర్నూలు – చిత్తూరు రహదారిలోని మండల పరిధి నీలకంఠావుపేట పంచాయితీ దివిజ్ఞాన మందిరం సమీపంలో సోమవారం కారు బోల్తా పడడంతో నలుగురు గాయపడ్డారు. రాయచోటి టౌన్‌కు చెందిన విశ్వనాథ రాజంపేటలోని ఓ కాలేజీలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈయన భార్య నాగమణి, కుమారులు కార్తీక్, నరసింహులుతో కలిసి కారులో విజయవాడ నుంచి రాయచోటి వస్తుండగా మార్గంమధ్యలో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వారు నలుగురు గాయపడ్డారు. వారిని 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు.

బైక్ అదుపు తప్పి..

గాలివీడు : మండల పరిధి కరిమిరెడ్డిగారిపల్లె వద్ద బైక్ అదుపు తప్పడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గోపనపల్లె గ్రామం పూజారివాండ్లపల్లెకు చెందిన నాగేశ్వర్‌రెడ్డి, ప్రమీళమ్మ బైక్‌పై వెళ్తుండగా.. వెనుకన కూర్చున్న ప్రమీళమ్మ చీర టైరుకు చుట్టుకోవడంతో అదుపు తప్పి కింద పడ్డారు. ఈ ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. ప్రమీళమ్మకు రాయచోటిలో చికిత్స అందిస్తుండగా, నాగేశ్వర్‌రెడ్డిని కడపకు తరలించినట్లు బంధువులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు

రామాపురం : కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారిలోని రామాపురం మండల పరిధి బండపల్లి పంచాయతీ పొత్తుకూరుపల్లె క్రాస్ రోడ్డు సమీపంలో ఆదివారం అర్ధరాత్రి 12 గంటలకు ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో భార్య, భర్తలు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వీరబల్లి మండలం మాదిరెడ్డిగారిపల్లెకు చెందిన రెడ్డయ్య, శాంతమ్మ రామాపురం మండలంలోని కుమ్మరపల్లె పంచాయతీ మన్నేరువాండ్లపల్లె గ్రామంలో ఓ కార్యక్రమానికి హాజరై తిరిగి ఇంటికి వెళ్తుండగా వెనుక వైపు నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో వారిద్దరూ గాయపడ్డారు. వారిని 108లో రాయచోటి ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కడప రిమ్స్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.